ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 28.5
కనిష్ఠం 23.0

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

ఆదివారం 22 సెప్టెంబరు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.80 (311.4474)	7,699	44,943
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.90 (4.17)	1,825	435.94
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.89 (45.61)	29,845	33,640

చికెన్ ధరలు | లైవ్ : రూ.145 | డ్రెస్ : రూ.220 | స్కిన్‌లెస్ : రూ.250



చాకలిగట్టుకు మహర్దశ

నాగార్జునసాగర్, సెప్టెంబరు 21 : ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లో మరో పర్యాటక కేంద్రం అందుబాటులోకి రానుంది. సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలో తవ్వకాల్లో బయల్పడిన బౌద్ధ మత నమూనాలను సాగర్ జలాశయం మధ్యలోని నాగార్జునకొండలో 1966లో పురావస్తు శాఖ మ్యూజియం నిర్మించి భద్రపరిచింది. దీంతో ఈ మ్యూజియాన్ని తిలకించేందుకు ప్రతీ ఏటా దేశ, విదేశాల నుంచి పర్యాటకులు సాగర్‌కు వస్తుంటారు. లాంచీలో వెళ్లి మ్యూజియంను తిలకించడంతో పాటు ఇక్కడ ఆనందంగా గడుపుతారు. ప్రస్తుతం దానిపక్కనే 1.5 కిలోమీటరు దూరంలో చాకలిగట్టు అనే అటవీ శాఖ జింకల పెంపక కేంద్రం ఉంది. ఈ గట్టును ఎకో టూరిజం కేంద్రంగా మార్చాలని రాష్ట్ర పర్యాటక శాఖ యోచిస్తోంది. దీంతో చాకలిగట్టుకు మహర్దశ పట్టనుందని భావిస్తున్నారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను పర్యాటక శాఖ మరింతగా అభివృద్ధి చేసి ఆదాయాన్ని సమకూర్చాలని భావిస్తోంది. దీంతో గత నెలలో రాష్ట్ర పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎండీలు సాగర్‌ను సందర్శించి చాకలిగట్టును పరిశీలించారు. చాకలిగట్టును ఎకో టూరిజం కేంద్రంగా ఏర్పాటుచేస్తే రాష్ట్ర పర్యాటక శాఖకు మరింత ఆదాయం సమకూరుతుందని పర్యాటక శాఖ ఉన్నతాధికారులు నివేదికలు త యారు చేసి మంత్రి జూపల్లి కృష్ణారావుకు అందజేశారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందించి చాకలిగట్టును ఎకో టూరిజం కేంద్రంగా చేయాలని నిర్ణయించారు.

రెండు పర్యాయాలు అధికారుల సర్వే

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఇప్పటికే నెల రోజుల వ్యవధిలో పురావస్తు శాఖ విభాగానికి చెందిన ఉన్నతాధికారులతో పాటు రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో కలిసి సర్వేలు చేశారు. మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. మొదటగా రూ.100 కోట్లతో చాకలిగట్టుపై కాటేజీలు, విద్యుత్ సౌకర్యం, తాగు నీటి సౌకర్యం, వంటి మౌలిక వసతులతో పాటు పర్యాటకులు రాత్రి వేళల్లోనూ అక్కడ బస చేసేలా టెంట్ కాటేజీలను కూడా ఏర్పాటుచేయాలని రాష్ట్రపర్యాటక శాఖ నిర్ణయించినట్లు సమాచారం.

- 407 ఎకరాల విస్తీర్ణం
- నాగార్జున సాగర్ జలాశయంలో మరో పర్యాటక ప్రాంతం
- కృష్ణమ్మ ఒడిలో అద్భుత ద్వీపం చాకలిగట్టు
- పర్యాటక కేంద్రంగా మార్చే ఆలోచనలో ప్రభుత్వం

ప్రకృతి రమణీయం..

నల్లటి దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో పక్షుల కిలకిలలతో, కృష్ణమ్మ జలసవ్వడితో ప్రకృతి ప్రేమికులను ఎంతగానో ఆకట్టుకునే అద్భుతమైన పర్యాటకప్రాంతాలు అంతర్జాతీయ పర్యాటక ప్రాంత మైన నాగార్జునసాగర్‌లో ఉన్నాయి. సాగర్ హిల్‌కాలనీ డౌన్ పార్క్ వద్ద ఉన్న తెలంగాణ లాంచీ స్టేషన్ నుంచి జలాశయం మధ్యలో ఏపీ అటవీ ప్రాంతంలోని నాగార్జునకొండకు వెళ్లే మార్గంలో హిల్‌కాలనీ లాంచీ స్టేషన్ నుంచి 15 కిలోమీటర్ల దూరంలో నాగార్జునకొండ ఉంటుంది. అక్కడి నుంచి కేవలం 1.5 కిలోమీటర్ల దూరంలో 407 ఎకరాల్లో చాకలిగట్టు విస్తరించి ఉంది. అటవీశాఖ ఆధ్వర్యంలో జింకల పెంపక కేంద్రంగా ప్రస్తుతం పేరొందింది. విశాలంగా చుట్టూ నీటితో ద్వీపకల్పంగా ఉండే చాకలిగట్టు ప్రకృతి రమణీయతకు నిలయంగా ఉంటుంది. అద్భుతమైన ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దితే మరింత శోభ వచ్చే అవకాశం ఉంటుంది. అదేవిధంగా సాగర్‌లో మరో పర్యాటక ప్రాంతంగా వెలుగొందనుంది.



ఉపాధి పనులు పకడ్బందీగా చేపట్టాలి

రూరల్ డెవలప్‌మెంట్ అదనపు సెక్రటరీ అనిల్‌కుమార్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ అనితారామచంద్రన్, కలెక్టర్ హనుమంతు కే.జెండగే

ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించిన పంచాయతీరాజ్‌శాఖ కేంద్ర బృందం




జలాల్‌పూర్‌లో మహిళా సంఘాల ప్రతినిధులతో గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ అదనపు కార్యదర్శి అనిల్‌కుమార్, తదితరులు

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 21: గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం పనులను పకడ్బందీగా అమలుచేయాలని రూరల్ డెవలప్‌మెంట్ అదనపు సెక్రటరీ అనిల్‌కుమార్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ అనితా రామచంద్రన్ అధికారులను ఆదేశించారు. భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను వారు పరిశీలించారు. ఉపాధి హామీ పనుల పనితీరుపై మండలస్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. మహిళా సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. మహిళా ఉపాధి హామీతోపాటు పలు కార్యక్రమాల ద్వారా తమ ఆర్థిక స్వాలంభన పెంపొందించుకోవాలన్నారు. భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థను సందర్శించిన అధికారుల బృందం సంస్థ ద్వారా గ్రామీణ యువతీ యువకులకు పలు ట్రేడుల్లో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను వారు పరిశీలించారు. గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు పలు ట్రేడుల్లో ఉపాధి ఆధారిత శిక్షణ ద్వారా వారు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. సంస్థ చేపడుతున్న శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ హనుమంతు కే.జెండగే, స్పెషల్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ షఫియుల్లా, స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టర్ సురేష్ బాబు, అదనపు కలెక్టర్ గంగాధర్‌తో కలిసి బృందం పర్యటించింది. కార్యక్రమాల్లో జడ్పీ సీఈవో శోభారాణి, డీఆర్‌డీవో నాగిరెడ్డి, డీఆర్‌డీవో అదనపు డైరెక్టర్ సురేష్, ఎంపీడీవో రాపర్తి భాస్కర్, ఎంపీవో మాజిద్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పారదర్శకంగా నిర్వహించాలి

చౌటుప్పల్ రూరల్: ఉపాధిహామీ పనులను పారదర్శకంగా నిర్వహించాలని అనిల్‌కుమార్ అన్నారు. శనివారం రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్‌తో కలిసి చౌటుప్పల్ మండలం దేవలమ్మనాగారంలో ఉపాధిహామీ పనులను పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. కూలీ డబ్బులు సక్రమంగా అందుతున్నాయా ? అని ప్రశ్నించారు. అనంతరం చౌటుప్పల్ ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. ఉపాధి పనుల నమోదు, మస్టర్ రోల్స్ తయారీ, కూలీ డబ్బుల చెల్లింపు ఏ విధంగా జరుగుతుందో తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్పెషల్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ షఫియుల్లా, స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టర్ సురేష్, జిల్లా పరిషత్ సీఈవో శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, డీఆర్‌డీవో అదనపు డైరెక్టర్ సురేష్, డివిజనల్ పం చాయతీ అధికారి ప్రతాప్‌నాయక్, ఎంపీడీవో ప్రమోద్‌కుమార్, అంజిరెడి పాల్గొన్నారు.



వీరికి రుణమాఫీ వర్తించదా?

- రుణమాఫీ కోసం నిరీక్షణ
- 2.66లక్షల రైతుల్లో 62వేల మందికే రుణమాఫీ
- మాఫీ అయ్యింది రూ. 500కోట్లు
- ఇంకా మిగిలింది 2.04 లక్షల మంది రైతులు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 21: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు రుణమాఫీ పథకంలో లబ్ధి చేకూరని రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడు విడతలు దాటినా కూడా రుణమాఫీ కాకపోవడంతో నైరాశ్యానికి గురవుతున్నారు. మూడో విడతలో కూడా రుణమాఫీ కాకుంటే ముందే అందిన ఫిర్యాదుల మేరకు బ్యాంకు, వ్యవసాయశాఖ అధికారులు సంయుక్తంగా విచారించి గ్రామకమిటీ ద్వారా లబ్ధి చేకూర్చేందుకు చర్యలు చేపట్టనున్నారు. రేషన్ కార్డులు, పీఎం కిసాన్ పథకంలో లేనివారికి, ఆదాయ పన్ను చెల్లించే వారి పేర్లు రుణమాఫీ పథకంలో నమోదు కావడంలేదు. రేషన్‌కార్డులో ఒకే కుటుంబానికి చెందిన తండ్రీ, కుమారుల పేర్లు ఉండి, వారసత్వంగా పొందిన భూమికి రుణం తీసుకున్న రైతులకు మాఫీ వర్తించడంలేదు. అదేవిధంగా గతంలో పాస్ పుస్తకం ఉండి ప్రస్తుతం కొత్త పట్టాదారు పాస్ పుస్తకం లేని రైతులకు కూడా పథకంలో లబ్ధి చేకూరడంలేదు.

మూడు విడతలుగా..

జిల్లాలోని 17 మండలాల్లో 2,66,881 మంది రైతులు ఉండగా 2024 రుణ మాఫీ పథకంప్రకారం మొదటి విడత 32,693 మంది, రెండో విడత 17,991 మంది,మూడో విడత 11,495 మందితో కలిపి మొత్తం 62,179 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగింది. ఇంకా 2,04,702 మంది రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ఇందులో ఈ నెల 19 వరకు ఆయా మండలాల వ్యవసాయ శాఖల ద్వారా 4,266 ఫిర్యాదులు అందినట్లు జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ తెలిపారు. అధికారుల ద్వారా అందే ఫిర్యాదుల సంఖ్య మరింత పెరగనుండగా ప్రత్యేకంగా కలెక్టరేట్‌లో టోల్‌ఫ్రీ నెం:08685-293312 ద్వారా రైతుల నుంచి అందిన ఫిర్యాదులను నమోదు చేస్తున్నారు.

4,266 మంది ఫిర్యాదులు

వీరికి ఇప్పటివరకు మూడు విడతల్లో కూడా రుణమాఫీ వర్తించలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రుణమాఫీ కాని రైతులు మండల వ్యవసాయ అధికారులను సంప్రదించి కావాల్సిన ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతా, పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఫోన్ నంబర్లు తదితర ధ్రువపత్రాలను రైతులు అందజేస్తున్నారు. ఆధార్, రేషన్‌కార్డుతోపాటు మరో 16 రకాల కారణాలతో మిగిలిన 2,04,179 మంది రైతుల్లో శనివారం వరకు 4,266 మంది రైతులకు రుణమాఫీ నిలిచిపోయింది. ప్రస్తుతం రుణమాఫీ పట్ల రైతులు ఆందోళన చెందుతున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తిస్తుందని భరోసా ఇస్తోంది.

రైతుల్లో ఆందోళన అవసరం లేదు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన రుణమాఫీ పథకం మూడు విడతలు అమలు కాగా 62,179మందికి లబ్ధిచేకూరింది. ఇప్పటివరకు రూ.500కోట్లు రుణమాఫీ అయ్యింది. ఇప్పటివరకు 4,266 మంది నుంచి ఫిర్యాదు లు అందాయి. వీరికి ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామసభల ద్వారా రుణమాఫీ జరుగుతోంది. లబ్ధిదారులు నిరాశ చెందాల్సిన అవసరంలేదు. అర్హులైన ప్రతీ ఒక్కరైతుకు రుణమాఫీ అందుతోంది.

- గోపాల్, వ్యవసాయ శాఖ అధికారి, యాదాద్రి జిల్లా

రూ.500కోట్ల రుణమాఫీ

భూమి పట్టాదారు పాసుపుస్తకం ద్వారా 2018 డిసెంబరు 12నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ వరకు వివిధ బ్యాంకుల్లో పంట రుణాలు పొందిన రైతులకు ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించింది. మూడు విడతల్లో 62,179 మంది రైతులకు రూ.500కోట్లు రుణమాఫీ చేసింది. ఇందులో జీరో నుంచి రూ.లక్ష వరకు మొదటి విడత సందర్భంగా జూలై 18న రూ.178.42కోట్లు, జూలై 30న రెండో విడత రూ.లక్ష నుంచి లక్షన్నర మాఫీకి రూ.176.12కోట్లు, మూడో విడత రూ.లక్షన్నర నుంచి రూ.2లక్షల వరకు రూ.145.46కోట్లు రైతులకు రుణమాఫీ అయ్యింది. మూడు విడతల్లో కూడా రుణమాఫీ జరగని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మండలం	కుటుంబ సమస్య	రూ. 2లక్షల మించి రుణం	డేటా లేనివి	ఆధార్ సమస్య	పేర్ల సమస్య	బ్యాంకు సమస్య	పీఏసీఎస్	పీపీబీ	డీబీటీ	ఇతర కారణాలు	మొత్తం
భువనగిరి	121	131	30	3	13	0	40	0	10	0	348
యాదగిరిగుట్ట	110	37	54	0	22	3	0	7	5	12	250
ఆలేరు	127	0	3	9	15	0	0	16	9	10	189
ఆత్మకూర్(ఎం)	90	14	24	2	4	10	0	1	1	1	147
గుండాల	107	0	6	11	11	0	0	18	7	3	163
అడ్డగూడూరు	80	22	48	12	11	0	0	8	1	6	188
మోత్కూరు	124	0	32	18	0	0	0	5	0	8	187
బీబీనగర్	64	28	3	3	0	2	0	0	0	8	108
పోచంపల్లి	72	0	40	18	10	0	5	4	10	10	169
వలిగొండ	28	0	708	2	10	0	1	17	11	9	786
చౌటుప్పల్	304	0	82	11	0	0	0	8	1	2	408
నారాయణపురం	117	21	33	19	11	0	0	0	4	10	215
రామన్నపేట	9	0	293	10	24	0	0	0	20	3	359
బొమ్మలరామరం	39	21	12	7	8	6	2	8	3	3	109
రాజాపేట	75	1	49	5	49	13	5	17	7	12	233
తుర్కపల్లి	126	41	37	11	21	14	0	12	1	0	263
మోటకొండూరు	21	0	26	0	5	1	0	1	1	0	55
జిల్లా స్థాయి	0	0	0	0	2	1	0	1	0	10	14
మొత్తం	1,617	320	1,487	147	223	58	62	133	102	119	4,266

నిస్వార్థ సేవకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



ఆలేరులో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

ఆలేరు రూరల్,సెప్టెంబరు 21: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంకోసం పరితపించిన నిస్వార్థ సేవకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. శనివారం ఆలేరులో ఆయన వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. నిబద్ధత, నిజాయితీ కలిగిన ఇలాంటి నాయకులు ఉండడంచాలా అరుదు అన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

నేతన్నల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని బీర్ల అయిలయ్య అన్నారు. ఆలేరులో నేతన్నలకు చేయూత పథకం కింద లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. నియోజకవర్గంలోని 1,862 మంది చేనేత కార్మికులకు 11 నెలల బకాయిలను రూ.18.60కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. గత ప్రభుత్వం చేనేత కార్మికులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ప్రజల సంక్షేమమే తమ అభిమతమన్నారు. ఈ సందర్భంగా కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఆలేరు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు గంధమల్ల అశోక్, చీర శ్రీశైలం, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, ఆలేరు మునిసిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, నీలం పద్మ, తదితరులు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

స్వామి సేవలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని •6లో..

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత

మునిసిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు



భువనగిరిలో విద్యార్థులు, మునిసిపల్ సిబ్బంది మానవహారం

భువనగిరి టౌన్, సెప్టెంబరు 21: పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత అని మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం భువనగిరిలో నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవా ర్యాలీలో మాట్లాడారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే పట్టణానికి ప్రత్యేక గౌరవం, గుర్తింపు లభిస్తాయన్నారు. ఈ రెండింటి సాధనకు ప్రజలు సహకరించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములమవుతామంటూ మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ రామాంజుల్ రెడ్డి, అధికారులు, విద్యార్థులు, నాయకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు, గురువులది సమాన బాధ్యత

● కూరెళ్ల విఠలాచార్య

రామన్నపేట, సెప్టెంబరు 21: విద్యార్థులను క్రమశిక్షణగల పౌరులుగా, విద్యలో రాణించే విధంగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులది సమాన బాధ్యత అని కూరెళ్ల విఠలాచార్య తెలిపారు. శనివారం వెల్లంకి ప్రాథమిక పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ విద్యార్థికి క్రమ శిక్షణ అవసరమని తెలిపారు. పోటీ ప్రపంచంలో మన పిల్లలు నిలబడి రాణించే విధంగా ప్రాథమిక స్థాయి నుంచి తగిన పునాదులు పడాలన్నారు. పిల్లల కు ఇంటి ఆవరణలో చదువుకునేందుకు అనువైన వాతావరణాన్ని తల్లిదండ్రులు కల్పించాలని, వారి చదువుపై ప్రవర్తనపై దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పద్మశ్రీ పురస్కార గ్రహిత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పల్లె మోహన్‌రెడ్డి, దాతలు తూటి మురళీధర్ ఈడెం శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ పులగం సులోచన, మాజీ చైర్మన్ కర్రె రాజు, ఉపాధ్యాయులు ఇట్టె సోమిరెడ్డి, ఉయ్యాల భిక్షమయ్య, దూదిగామ సువర్ణ పాల్గొన్నారు.



పద్మశ్రీ కూరెళ్ల విఠలాచార్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

భువనగిరిలో భారీ వర్షం



భువనగిరి టౌన్, సెప్టెంబరు 21: జిల్లా కేంద్రం భువనగిరిలో శనివారం భారీ వర్షం కురిసింది. సుమారు గంటకు పైగా కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించిపోయింది. రహదారులు, లోతట్టు ప్రాంతాలు వర్షం నీటితో నిండగా మురుగుకాల్వలు పొంగిపొర్లాయి. పలుబస్తీలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. అలాగే చల్లటి చిరుగాలులు వీయడంతో వృద్ధులు చలికి ఇబ్బందులు పడ్డారు. మరో రెండు రోజులపాటు వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా పలువురు తమ ప్రయాణాలను, పనులను కుదించుకున్నట్లు తెలుస్తోంది.

వలిగొండ: మండలంలోని పలు గ్రామాల్లో మోస్తారు వర్షం కురిసింది. మండంలోని 5.46 సెం.మీల వర్షపాతం నమోదైంది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి మూసీనదికి వరదనీరు వచ్చి చేరుతోంది. సంగెం గ్రామం, భీమలింగం కత్వ వద్ద వరద అంతకంతకు పెరుగుతోంది.





యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు

» స్వామివారిని దర్శించుకున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని



నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, సెప్టెంబరు 21 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకస్వాములు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవారిని మనోహరంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. శివాలయంలో నిత్యారాధనలు, రుద్రహవన పూజలు శైవాగమ పద్ధతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.17,69,083 ఆదాయం సమకూరినట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. కాగా, స్వామివారిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణికుముదిని, ప్రముఖ సినీ దర్శకుడు పూరి జగన్నాథ్ కొడుకు ఆకాశ్ దర్శించుకున్నారు. వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా,ఈఓ లడ్డూ ప్రసాదం అందజేశారు.

నేడు మంత్రుల రాక

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ఆదివారం రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో పాటు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ నవీన్ (తీన్మార్‌మల్లన్న) దర్శించుకోనున్నారు. ఉదయం ఆలయంలో స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తారు. మంత్రుల రాక సందర్భంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అనంతరం నియోజకవర్గ కేంద్రంలో ఆలేరు మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.

గిరిప్రదక్షిణ చుట్టు బెంచీలు

యాద'గిరి'గుట్ట ప్రదక్షిణలు చేసే భక్తుల కోసం శనివారం భువనగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పద్మజా ఆసుపత్రి సహకారంతో బెంచీలు ఏర్పాటు చేశారు. గిరిప్రదక్షిణ చేసే దారిలో భక్తులు సేద తీరేందుకు 33సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు.సేవ దృక్పథంతో ఏర్పాటు చేసిన బెంచీలు మరిన్ని అందుబాటులోకి తేనున్నటు క్లబ్ అధ్యక్షుడు కరిపె నర్సింగ్‌రావు, కార్యదర్శి కూచిపట్ల సత్యనారాయణరెడ్డి, కోశాధికారి ఇటికాల దేవంద్రచారి, క్లబ్ మాజీ అధ్యక్షుడు పడమటి జగన్మోహన్‌రెడ్డి, బాలయ్య, పలుగుల ఆగేశ్వరరావు, వేమూరి అశోక్, హరికృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

పేద కుటుంబాన్ని వరించిన ప్రభుత్వ ఉద్యోగం

» *గట్టికల్ యువకుడు సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఎంపిక*



సూర్యాపేట, సెప్టెంబరు 21: నిరుపేద దళిత కుటుంబం జన్మించి స్వశక్తితో ఎదిగి ప్రభుత్వ ఉద్యోగం సాధించి తోటి వారికి ఆదర్శంగా నిలుస్తున్నాడు ఆత్మకూర్ (ఎస్) మండలం గట్టికల్ గ్రామానికి చెందిన గాదె కోటేశ్. పోస్టు గ్రాడ్యుయేట్ పూర్తి చేసి ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తూనే, ప్రతిరోజు పాలను విక్ర యించి, అనంతరం తాను పనిచేసే కళాశాలలో విధుల్లోకి వెళ్లే యువకుడు నేడు సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఉద్యోగం సంపాదించాడు. 2022లో వచ్చిన నోటిఫికేషన్‌కు ఈ ఏడాది జూన్‌లో పరీక్ష రాశాడు. శనివారం విడుదలైన ఫలితాల్లో సోషల్ వెల్ఫేర్ అధికారిగా కోటేశ్ ఎంపికయ్యాడు. కోటేశ్‌కు రాష్ట్రస్థాయిలో 37వ ర్యాంకు వచ్చింది. యాదాద్రి భువనగిరి జోన్-5లో 9వర్యాంకు సాధించాడు. 2020లో కరోనా సమయంలో గట్టికల్‌లో డెయిరీ ఫామ్ ఏర్పాటు చేసి వివిధ గ్రామాల నుంచి పాలు తెచ్చి సూర్యాపేట, కుడకుడ, పీఎస్ఆర్ టౌన్‌షిప్‌లలో ఇంటింటికీ తిరిగి పాలు విక్రయించేవాడు. కోటేశ్‌కు ప్రభుత్వ ఉద్యోగం రావడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

ప్రైవేట్ వ్యక్తుల పేరిట ప్రభుత్వ భూమి

- ధరణి ఆపరేటర్ భూఅక్రమాలు
- 36.23 ఎకరాల ప్రభుత్వ భూమి బదలాయింపు
- మొత్తం భూమి విలువ రూ.18 కోట్లపైనే
- తల్లి, చెల్లి, కుటుంబ సభ్యుల పేరిట ఆన్‌లైన్‌లో నమోదు
- మరింత విచారణకు కలెక్టర్ ఆదేశం

రెవెన్యూ ఉన్నతాధికారుల అండదండలతో ధరణి ఆపరేటర్ అక్రమాలకు పాల్పడ్డాడు. ఏకంగా ప్రభుత్వ భూములను తన కుటుంబ సభ్యుల పేరు ధరణి రికార్డుల్లో నమోదు చేయించాడు. డిజిటల్ పాస్‌పుస్తకాలు పొంది మూడేళ్లుగా రైతుబంధు పొందుతున్నాడు. ఎకరం, రెండు ఎకరాలు కాదు ఏకంగా 36 ఎకరాల పైనే ధరణిలో చేర్చి పట్టాదార్ పాస్‌పుస్తకాలు పొందడం గమనార్హం. మొత్తం భూమి విలువ రూ.18 కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం. ప్రస్తుతం ధరణి ఆపరేటర్‌ను రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో పోలీసులు విచారిస్తున్నారు.

- హుజూర్‌నగర్

సూర్యాపేట జిల్లాలో ధరణి పోర్టల్‌లో చోటుచేసుకున్న అక్రమాలు చర్చనీయాంశంగా మారాయి. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ఒక రెవెన్యూ అధికారిపై భూమార్పిడికి సంబంధించి జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్న సమయంలో హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డలో జరిగిన అక్రమ భూమి పట్టా మార్పిడి వివరాలు వెల్లడించినట్లు తెలిసింది. తానొక్కడినే తప్పు చేయలేదని, ఇలాంటి తప్పులు హుజూర్‌నగర్ మండలంలో చాలా జరిగాయని చెప్పినట్లు సమాచారం. దీంతో ధరణి ఆపరేటర్ భూదందా వ్యవహారం వెలుగుచూసినట్లు తెలుస్తోంది. అయితే వెలుగుచూసింది గోరంత కాగా ఇంకా కొండంత ఉందని రెవెన్యూ వర్గాలే పేర్కొంటున్నాయి.



జగదీష్ ప్రైవేట్ వ్యక్తుల పేరిట నమోదు చేసిన ప్రభుత్వ భూమి ఇదే

హుజూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయ ధరణి ఆపరేటర్ వత్సవాయి జగదీష్ తన కుటుంబ సభ్యులు, బంధువుల పేరు మీద ఏకంగా 36. 23 ఎకరాల భూమిని ధరణ పోర్టర్‌లో నమోదుచేసినట్లు ఇటీవల జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ శుక్రవారం రాత్రి వెల్లడించారు. 2019-20లో హుజూర్‌నగర్ మండలంలో పనిచేసిన ఉన్నతాధికారుల అండదండలతోనే ధరణి ఆపరేటర్ జగదీష్ ఈ దందాకు పాల్పడినట్లు సమాచారం. హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ రెవెన్యూ పరిధిలో వేణుగోపాలస్వామి దేవాలయం, గోపాలపురం శివారు, పెద్దచెరువు, నల్లచెరువు ప్రాంతాల్లో 36.23 ఎకరాల ప్రభుత్వ మిగులు భూమి ఉంది. ఆ భూమిని కొంతమంది వ్యక్తులు సాగు చేసుకుంటున్నారు. ఎకరం ఇక్కడ రూ.50 లక్షలపైనే ఉంది. ఈ భూమి విలువ సుమారు రూ.18కోట్లపైనే ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. కోట్లు విలువచేసే భూమిని రెవెన్యూ అధికారుల అండందండలతో జగదీష్ అతడి కుటుంబ సభ్యుల పేరు మీద పోర్టర్‌లో నమోదు చేశాడు. బూరుగడ్డ గ్రామంలో 439 సర్వే నెంబర్‌లో 164 ఎకరాల 12 కుంటల భూమి, 604 సర్వే నెంబర్‌లో 164 ఎకరాల భూమి ఉంది. అతిపెద్ద సర్వేనెంబర్లు కావడంతో ప్రభుత్వ మిగులు భూమి అధికంగా ఉంది. వీటితో పాటుగా 602, 608, 1041 సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూమి ఉండగా వాటన్నింటిని ధరణి ఆపరేటర్ కుటుంబ సభ్యుల పేరు మీద పోర్టర్‌లో నమోదుచేసినట్లు అధికారులు గుర్తించారు. 2019 నవంబరు నుంచి 2020 ఫిబ్రవరి మధ్య కాలంలో భూమి బదలాయింపులు జరిగినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. భూమి బదలాయింపుతో పాటు రైతుబంధు, రైతురుణమాఫీ లబ్ధికూడా పొందినట్లు సమాచారం. ప్రభుత్వ భూమి పట్టా మార్పుపై కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో శ్రీనివాసులు విచారణ జరిపి మూడు రోజుల కిందట నివేదిక అందించారు. ఆ నివేదిక వివరాలను డీపీఆర్వో రమేష్ శుక్రవారం రాత్రి మీడియాకు విడుదల చేశారు. అదేవిధంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ధరణి ఆపరేటర్ జగదీష్‌ను డిస్మిస్ చేశారు. స్థానిక రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో జగదీష్‌ను పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

జగదీష్ పట్టా చేసిన ప్రభుత్వ భూములు ఇవే

బూరుగడ్డ గ్రామంలోని సర్వే నెంబర్ 439/55/5లో 8 ఎకరాల 38 గుంటలు, 604/116లో 7.32 గుంటల భూమిని పచ్చిపాల ప్రియాంక పేరు మీద పోర్టర్‌లో నమోదు చేశారు. మొత్తంగా 15.7 ఎకరాలు ఆమె పేరు మీద నమోదుచేశారు.

సర్వే నెంబర్ 604/58లో 4.38 గుంటలు మడిపల్లి స్వప్న సోదరి పేరు మీద నమోదుచేశారు.

హుజూర్‌నగర్‌లోని 602/102/1లో 0.01 గుంటలు, 608/16లో 8.0 ఎకరాల భూమిని జగదీష్ తల్లి వత్సవాయి ఇందిర పేరు మీద నమోదు చేశారు.

అదేవిధంగా 1041/144లో 6.25 ఎకరాలు, 1041/368/3/2/5లో 0.10 గుంటల భూమిని ఇందిర పేరు మీద ఇలా మొత్తం 36.23 కుంటల ప్రభుత్వ భూమిని నిబంధనలకు విరుద్ధంగా ధరణి పోర్టర్‌లో నమోదు చేసినట్లు విచారణలో తేలింది.

కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేశాం



కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాల మేరకు బూరుగడ్డలోని పలు సర్వే నెంబర్లకు సంబంధించి విచారణ చేశాం. ధరణి ఆపరేటర్ జగదీష్ అతడి తల్లి, చెల్లి, కుటుంబ సభ్యుల పేరు మీద 36.23 ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు విచారణలో తేలింది. నివేదికను కలెక్టర్‌కు అందించడంతో అదనపు కలెక్టర్ లతను పూర్తి విచారణ చేయాలని ఆదేశించారు. మండలంలో, పట్టణంలో ధరణిలో జరిగిన అవకతవకలపై మరోసారి కలెక్టర్‌కు నివేదిక ఇస్తాం.

శ్రీనివాసులు, ఆర్డీవో, హుజూర్‌నగర్

విచారణకు ఆదేశం

బూరుగడ్డలో 36.23 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రైవేట్ వ్యక్తుల పరం చేసిన అక్రమాలపై పూర్తి విచారణ కోసం అదనపు కలెక్టర్ లతను కలెక్టర్ తేజస్‌నందాలాల్ పవార్ నియమించారు. అప్పటి అధికారులపై సైతం విచారణ చేయాలని ఆదేశించారు. ధరణ ఆపరేటర్‌పైనే నెపమంతా నెట్టేసి అధికారులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కోట్లు విలువచేసే భూమి ఉన్నతాధికారుల సహకారం లేకుండా డిజిటల్ సంతకాలు ఎలా చేస్తారన్న అనుమానాలు ఉన్నాయి. దీంతో అప్పటి అధికారులను కూడా విచారించనున్నట్లు సమాచారం.

ఇతర గ్రామాల్లోనూ ప్రభుత్వ భూమి బదలాయింపు

హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డలోనే కాకుండా హుజూర్‌నగర్ పట్టణం, లింగగిరి, అమరవరం, వేపలసింగారం, శ్రీనివాసపురం గ్రామాల్లో సైతం ధరణిలో ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా రెవెన్యూ అధికారుల అండతో ప్రభుత్వ భూములను పక్కనే ఉన్న భూస్వాముల పేరు మీద ధరణి పోర్టర్‌లో నమోదు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. హుజూర్‌నగర్ పట్టణంలో 1041, 608, 154, 273 సర్వేనెంబర్లతో పాటు మరికొన్ని నెంబర్లలో సుమారు 300 ఎకరాలపైనే ప్రభుత్వ భూములను సన్న, చిన్నకారు రైతులకు, భూస్వాములకు ధరణి పోర్టర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నమోదు చేసినట్లు తెలుస్తోంది. హుజూర్‌నగర్ పట్టణంలోని గోవిందాపురం, ముక్త్యాల మేజర్ కాల్వ సమీపంలో రామస్వామి గుట్టకు వెళ్లే దారిలో, వేపలసింగారం రోడ్డు, మట్టపల్లి, లింగగిరి రోడ్డులోని ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తుల పేర్ల మీద రికార్డుల్లోకి ఎక్కించినట్లు సమాచారం. ఇక్కడ పనిచేసిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని రికార్డులలో అక్రమంగా నమోదుచేసినట్లు విమర్శలు ఉన్నాయి. ధరణి వచ్చినప్పటి నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేయగా అంతకుముందు మాన్యువల్‌గా రికార్డుల్లో నమోదు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉండగా అధికారులకు తెలిసిన, బయటపడిన సమాచారం రూపాయిలో 10 పైసల వంతేనని, మిగిలిన 90 శాతం భూముల పరిస్థితి ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. పూర్తిస్థాయిలో ప్రభుత్వ భూముల లెక్కలు తీసి బదలాయింపు జరిపిన వివరాలపై విచారణ చేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

అధికారుల అండతో ఇసుక దందా

● బంగారంతో పోటీపడుతున్న ఇసుక ధర



ట్రాక్టర్ లోడుతో వెళ్తున్న ఇసుక

మద్దిరాల, సెప్టెంబరు 21 : అధికారుల అండతో సూర్యాపేట జిల్లా మద్దిరాలలో ఇసుక విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా రాత్రి వేళల్లో ఇసుకను అక్రమంగా తరలించి కాసులు దండుకుంటున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన రెవెన్యూ, పోలీస్ సిబ్బంది చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా గ్రామాల్లో ప్రజలు ఇంటి ప్రహరీలు, మరుగుదొడ్ల నిర్మాణాల కోసం ఇసుక అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని పాలేరు వాగు, జీ కొత్తపల్లి, ముకుందాపురం, పీర్యాతండా నుంచి రాత్రివేళ ఇసుకను జోరుగా ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఒక్కో ఇసుక ట్రాక్టర్ ధర రూ.5500నుంచి రూ.6500వరకు విక్రయాలు జరుగుతున్నాయి. ఇసుక ధరలను చూసి ప్రజలను బంగారంతో పోల్చుకుంటున్నారు. బంగారం మాదిరే ఇసుక ధరలు మండిపోతున్నాయని సామాన్యులు వాపోతున్నారు.

మా దృష్టికి రాలేదు, వస్తే చర్యలు తీసుకుంటా



మండలంలోని పాలేరు వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు మా దృష్టికి తీసుకువస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కొంతమంది అధికారులు ఇసుకను గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తే వారిపై కూడా చర్యలు ఉంటాయి. ప్రభుత్వం నుంచి ఇసుక రవాణాకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు.

- వీరన్న, ఎస్ఐ మద్దిరాల మండలం

డీసీఎం ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ మృతి



శేఖర్(ఫైల్)

మాడ్గులపల్లి, సెప్టెంబరు 21 : డీసీఎం, బైక్ ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలకేంద్రంలోని అద్దంకి-నార్కట్‌పల్లి రహదారిపై శనివారం జరిగింది. ఎస్ఐ శోభన్‌బాబు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఇందుగుల ఆవాస గ్రామమైన మలపరాజుగూడెం గ్రామానికి చెందిన ఫుట్ట శేఖర్(32) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. డీజిల్ కోసం శనివారం ఉదయం బైక్‌పై మాడ్గులపల్లి మండలకేంద్రానికి వచ్చి తిరిగి వెళ్తున్నాడు. చెన్నై నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న డీసీఎం అతివేగంగా బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్రగాయాలైన శేఖర్ అక్కడికక్కడే మృతిచెందాడు. శేఖర్ మృతదేహాన్ని మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం పోలీసులు కుటుంబసభ్యులకు అప్పగించారు. శేఖర్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా భార్య మనీషా ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని ప్రమాదానికి కారణమైన డీసీఎం డ్రైవర్ నిజాంఖాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు..



సైదులు(ఫైల్)

సూర్యాపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం కందగట్ల గ్రామంలో విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. శనివారం స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రైతు మంచాల సైదులు(62) తన వ్యవసాయ బావివద్ద పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ ఆఫ్ అయి ఉండడంతో ఆన్‌చేయగా శిథిలావస్థలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైరు తెగి మీద పడింది. దీంతో విద్యుదాఘాతానికి గురై తీవ్రగాయాలయ్యాయి. సమీపంలో ఉన్న మహిళా రైతు గమనించి స్థానికులకు సమాచారం ఇచ్చింది. ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేయగా అప్పటికే మృతి చెందాడు. సైదులుకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

పాముకాటుతో 15 నెలల చిన్నారి..



పవిత్ర(ఫైల్)

చందంపేట, సెప్టెంబరు 21: పాముకాటుతో 15 నెలల చిన్నారి మృతి చెందింది. ఈ సంఘటన శనివారం నల్లగొండ జిల్లా చందంపేట మండలం పోగిళ్ల గ్రామంలో జరిగింది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పోగిళ్ల గ్రామానికి చెందిన జటావత్ గంగ, కిషన్ దంపతులు వ్యవసాయం చేసుకుంటు జీవిస్తున్నారు. శనివారం వ్యవసాయ పనులు ముగించుకొని రాత్రి భోజనం అనంతరం ఇంట్లో కింద నిద్రించారు. దంపతులకు ఒక్కగానొక్క కుమార్తె పవిత్ర (15 నెలలు) అర్ధరాత్రి ఏడుస్తుండడంతో మేలుకున్న తల్లిదండ్రులు పాప పక్కలో పాము ఉండటం చూసి కాటుకు గురైనట్లు గుర్తించారు. పామును చంపి చిన్నారిని చికిత్స కోసం దేవరకొండకు తరలిస్తుండగా మార్గమధ్యలో పాప మృతి చెందింది. కుమార్తె మృతితో విషాదం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గుర్తుతెలియని వ్యక్తి

మిర్యాలగూడ అర్బన్, సెప్టెంబరు 21 : రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి గాయపడ్డాడు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలో ఈనెల 19న జరిగిన సంఘటన వివరాలను రూరల్ ఏఎస్ఐ రాములునాయక్ శనివారం తెలిపారు. నార్కట్‌పల్లి- అద్దంకి రహదారి పక్కన గూడూరు గ్రామం వద్ద నిలబడి ఉన్న వ్యక్తిని దామరచర్ల నుంచి మిర్యాలగూడకు వస్తున్న బైక్ ఢీకొట్టగా తలకు గాయాలైనట్లు తెలిపారు. దామరచర్ల మండలం కొండ్రపోలు పరంగి మధు అనే వ్యక్తి తన బైక్‌ను అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణం కావడంతో గూడూరు గ్రామకార్యదర్శి రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు. కాగా గాయపడ్డ వ్యక్తికి మతిస్థిమితం సరిగ్గా లేదని, వయసు సుమారు 55 ఏళ్ల వరకు ఉంటుందని, ప్రస్తుతం మిర్యాలగూడ ఏరియాఆస్పత్రిలో చికిత్స పొం దుతూ కోలుకుంటున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. ఇతర వివరాల కోసం 9441562204 నెంబరుకు సమాచారం అందించాలని ఏఎస్ఐ రాములునాయక్ కోరారు.

అత్తారింటి వేధింపులు తాళలేక ఆత్మహత్య



కరుణ(ఫైల్)

శాలిగౌరారం, సెప్టెంబరు 21 : అత్తారింటి వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారం గ్రామంలో శనివారం జరిగింది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆకారం గ్రామానికి చెందిన సూరారపు రాజుకు నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు గ్రామానికి చెందిన కరుణతో ఆరేళ్ల కిందట వివాహమైంది. వీరికి మూడేళ్ల లోపు కుమార్తె, కుమారుడు ఉన్నారు. సూరారపు రాజు మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్య కరుణను నిత్యం వేధిస్తున్నాడు. తరచూ భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో కరుణ మనస్తాపం చెంది ఇంట్లో ముభావంగా ఉంటోంది. శుక్రవారం రాత్రి ఇంట్లో ఉన్న నిద్రమాత్రలు వేసుకుంది. శనివారం తెల్లవారుజామున చనిపోయి ఉండటంతో భర్త రాజు తన మామ మాతంగి నర్సయ్యకు సమాచారం అందించారు. కుమార్తె మృతికి అల్లుడు రాజుతో పాటు కుటుంబసభ్యులు కూడా కారణమని నర్సయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ఆస్పత్రికి తరలించారు.

రైస్‌మిల్లర్లపై కేసులు నమోదు

తిరుమలగిరి, సెప్టెంబరు 21 : కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఇవ్వని ఇద్దరు రైస్‌మిల్లు యజమానులపై కేసులు నమోదయ్యాయి. ఇందుకు సంబంధించి సూర్యాపేట జిల్లా తిరుమలగిరి ఎస్ఐ సురేష్ శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సివిల్ సప్లయ్ అసిస్టెంట్ మేనేజర్ బెనర్జీ ఫిర్యాదు మేరకు శ్రీలక్ష్మి రైస్ ట్రేడర్స్, హర్షిత రైస్‌మిల్లు యజమానులు గజ్జి ఉపేందర్, తునికిపాటి వినయ్ కుమార్‌లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. 2022-24 అన్ని సీజన్లకు కలిపి శ్రీలక్ష్మీ ట్రేడర్స్ నుంచి రూ.25.40 కోట్లు, హర్షిత మిల్లు నుంచి రూ.16.28కోట్లు బకాయిలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

భీమనపల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం



ధ్వంసమైన అంబేడ్కర్ విగ్రహం

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 21: యాదాద్రి-భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం భీమనపల్లి గ్రామంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. శనివారం ఉదయం విగ్రహం ధ్వంసమై ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి వారిపై కఠినచర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మీసాల గణేష ఎస్ఐ భాస్కర్‌రెడ్డికి ఫిర్యాదుచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు యాట కైలాసం, నాయకులు మీసాల గణేష్, కొమ్ము రమేష్, గూని బుచ్చయ్య, చెరుకు రాములు, కొమ్ము లింగస్వామి, మీసాల ప్రశాంత్, మీసాల తరుణ్, కొమ్ము రాకేష్, కొమ్ము సురేష్ పాల్గొన్నారు.

నీరందడం లేదని కాల్వలో రైతుల నిరసన




గోపాలపురం వద్ద డీ-37 కాల్వలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మాడ్గులపల్లి, సెప్టెంబరు 21: నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలో సాగునీటి కోసం రైతులు శనివారం కాల్వలో నిలబడి నిరసన తెలిపారు. పంట పొలాలు ఎండిపోతున్నాయని, రెండు నెలలుగా కాల్వ నీటి కోసం ఎదురుచూస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎడమ కాల్వ పరిధిలోని డీ-37 కాల్వ నల్లగొండ మండలం గుండ్లపల్లి వద్ద ప్రారంభమై కనగల్, తిప్పర్తి, మాడ్గులపల్లి మండలంలోని కన్నెకల్ వరకు సుమారు 27.05 కిలోమీటరు వరకు ఉంది. సుమారు 42వేల ఎకరాల్లో ఆయకట్టుకు నీరందించడంతో పాటు 19 చెరువులను నింపేందుకు ప్రభుత్వం ఈ కాల్వ నిర్మించింది. ఏఎమ్మార్పీ కాల్వ ద్వారా నీటి విడుదల ఆగస్టు నుంచి కొనసాగుతున్నా, చివరి భూములకు నీరు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో మాడ్గులపల్లి మండలం గోపాలపురం, మాచినపల్లి గ్రామాలకు చెందిన 20మంది రైతులు శనివారం కాల్వలో నిలబడి నిరసన తెలిపారు. రెండు నెలలుగా కాల్వకు నీటి విడుదల చేసినా చివరి భూములకు రావడంలేదని దీంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరితో పాటు ఎక్కువ మంది రైతులు బత్తాయి సాగు చేశారు. కాల్వకు నీరు రాకపోవడంతో బోరుబావులు అడుగంటిపోయాయని, కాల్వలో నీటి విడుదల సామర్థ్యాన్ని పెంచితే చివరి భూములకు నీరందడంతో పాటు భూగర్భజలాలు పెంపొందుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఎగువన ఉన్న అన్నారం, బసిరెడ్డిపల్లి, ముశంపల్లి, ఎల్లపల్లి గ్రామాల రైతులు కాల్వకు అక్రమ తూములు ఏర్పాటుచేయడంతో నీరు చివరి భూములకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో నీటి కోసం వెళ్తే బసిరెడ్డిపల్లి గ్రామస్థులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. డీ-37 కాల్వ ద్వారా చివరి భూములకు నీరందితే మాడ్గులపల్లి మండలంలోని గోపాలపురం, మాచినపల్లి, కన్నెకల్, కేశవాపురం గ్రామాల్లోని మూడు వేల ఎకరాలకు నీరందించాల్సి ఉండగా, నీరు అందకపోవడంతో బోరుబావుల ఆధారంగా రైతులు సుమారు 1,000 ఎకరాల్లో వేసుకున్న వరి పొలాలు, బత్తాయి తోటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వల పర్యవేక్షణ చేసి అక్రమంగా ఏర్పాటుచేసిన తూములను తొలగించి చివరి భూములకు నీరందించాలని రైతులు బోడ యాదయ్య, జూలకంటి శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నర్సిరెడ్డి, లక్ష్మణ్, శంకర్, వెంకటయ్య, యాదయ్య, అంజయ్య, కొమురయ్య, వెంకన్న, కొండలుతో పాటు పలువురు కోరుతున్నారు. సుమారు గంటకు పైగా నిరసన వ్యక్తం చేసి చివరి భూములకు నీరందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

నేడు హైదరాబాద్ టు బుద్ధవనానికి బైక్ ర్యాలీ

● 200 బైక్‌లతో 'నిర్వాణ' రైడ్

● ప్రారంభించనున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



'నిర్వాణ' ర్యాలీకి సంబంధించిన పోస్టర్

నాగార్జునసాగర్, సెప్టెంబరు 21: అంతర్జాతీయ బౌద్ధక్షేత్రమైన నాగార్జునసాగర్ హిల్‌కాలనీ బుద్ధవనంలో 274 ఎకరాల్లో నిర్మించిన బుద్ధవనానికి ఆదివారం హైదరాబాద్ నుంచి బైక్ రైడర్స్‌తో కలిసి 200 బైక్‌లతో 'నిర్వాణ రైడ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర పర్యాటకశాఖ ఎండీ, బుద్ధవనం ప్రత్యేక అధికారి ఎస్.ప్రకాష్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటలకు హైదరాబాద్‌లో ది ప్లాజా హోటల్ వద్ద ఈ రైడ్‌ను పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జెండా ఊపి ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. ఈ రైడ్ మధ్యాహ్నం 12గంటలకు సాగర్ బుద్ధవనానికి చేరుకుంటుందని తెలిపారు. మధ్యాహ్న భోజన అనంతరం బుద్ధవనాన్ని సందర్శించి తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్ పాల్గొంటారని తెలిపారు.

● బండి.. జగమొండి

క్లిక్ క్లిక్



నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి సూర్యాపేటకు వెళ్లే నల్లగొండ డిపోకు చెందిన ఆర్డీనరీ బస్సు ఎంతకూ స్టార్ట్ కాకపోవడంతో ప్రయాణికుల సహాయంతో డ్రైవర్ బస్సును స్టార్ట్ చేశారు.

ట్రాక్టర్ ట్రాలీల దొంగల రిమాండ్



ట్రాక్టర్ ట్రాలీలను చోరీ చేస్తున్న నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ రాజు

డిండి, సెప్టెంబరు 21 : పొలాల వద్ద ఉంచిన ట్రాక్టర్ ట్రాలీలను అపహరించిన వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నల్లగొండ జిల్లా డిండి ఎస్ఐ రాజు శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డిండి మండలం కామేపల్లి గ్రామానికి చెందిన మాధవరం సంపత్‌రావు, నాగర్‌కర్నూల్ జిల్లా బలుమూరు మండలం గట్టుతుమ్మెన గ్రామానికి చెందిన బొలగం శ్రీను, అదే జిల్లా అచ్చంపేట పట్టణానికి చెందిన కడారి బాబు ముగ్గురు స్నేహితులు. వీరు ట్రాక్టర్ ట్రాలీల దొంగతనాలకు పాల్పడుతుంటారు. కామేపల్లి గ్రామానికి చెందిన ఎదుర్ల సందీప్ తన ట్రాక్టర్ ట్రాలీని పొలం వద్ద ఉంచాడు. అదే గ్రామానికి చెందిన సంపత్‌రావు సూచన మేరకు అతడి స్నేహితులు బొలగం శ్రీను తన సొంత ట్రాక్టర్ ఇంజన్‌తో బాబుతో కలిసి ఈ నెల 4న పొలం వద్ద ఉంచిన ఎదుర్ల సందీప్ ట్రాక్టర్ ట్రాలీని అపహరించి అచ్చంపేటకు తరలించి ఒక చోట ఉంచారు. ఈ నెల 21న అపహరించిన ట్రాక్టర్ ట్రాలీని దేవరకొండలో విక్రయించేందుకు బొలగం శ్రీను, కడారి బాబు తరలిస్తుండగా డిండి శివారులో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం పర్వతగిరికి చెందిన మరో రైతు ట్రాక్టర్ ట్రాలీని కూడా ఈ ఏడాది జూలై 12న కడారి బాబు అపహరించి ట్రాలీని విక్రయించి పెట్టాలని సంపత్‌రావుకు అప్పగించాడు. విచారణ జరిపిన పోలీసులు రెండు ట్రాక్టర్ ట్రాలీలను తరలిస్తున్న ఇంజన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురుని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజు తెలిపారు.

ఇద్దరి అరెస్ట్, రిమాండ్

కనగల్, సెప్టెంబర్ 21: ఇసుక రవాణా కేసులో కోర్టుకు హాజరు కాని ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నల్లగొండ జిల్లా కనగల్ ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కనగల్ గ్రామానికి చెందిన నీలకంఠం ధనుంజయ్య, నక్క జగన్‌లపై జిల్లా స్పెషల్ మొబైల్ కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసింది. ఈ నేపథ్యంలో శనివారం సదరు వ్యక్తులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం వీరిని కోర్టు ఆదేశాల మేరకు జైలుకు తరలించినట్లు వివరించారు.

నిలకడగా సాగర్ నీటి మట్టం

నాగార్జునసాగర్, కేతేపలి, మేళ్లచెర్వు, సెప్టెంబరు 21: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటిమట్టం 589.80అడుగుల వద్ద నిలకడగా ఉంది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం నుంచి 7,699క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు(312.0450 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 589.80అడుగులు(311.4474టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 4,287 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,136 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 44,943 నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 7,699 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీకి పెరిగిన ఇన్‌ఫ్లో...

సాగర్ తర్వాత రెండో సాగునీటి ప్రాజెక్టుగా ఉన్న మూసీ రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో పెరిగింది. 10రోజులకు పైగా వర్షాలు లేకపోవడంతో ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గింది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి, శనివారం వర్షాలు కురవడంతో వరద దిగువకు వచ్చి ప్రాజెక్టులో చేరుతోంది. శనివారం సాయంత్రానికి 1,825 క్యూసెక్కులుగా నమోదైంది. 645(4.46టీఎంసీలు) అడుగుల పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం ఉన్న మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 643.90(4.17టీఎంసీ)అడుగులుగా ఉంది. మరోవైపు కుడి,ఎడమకాల్వలకు సాగునీటి విడుదల కొనసాగుతోంది. కుడికాల్వకు 120.82 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 314.14క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.

ఒక గేటు ద్వారా పులిచింతల నుంచి నీటి విడుదల

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న పులిచింతల ప్రాజెక్టుకు వచ్చిన వరదను వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175(45.77టీఎంసీలు)అడుగులు కాగా, శనివారం సాయంత్రానికి 174.89(45.61 టీఎంసీలు)అడుగులుగా నమోదైంది. ప్రాజెక్టు ఒక గేటు నుంచి 17,640క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16వేల క్యూసెక్కులను వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 104మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. మొత్తంగా అవుట్‌ఫ్లో 33,640 క్యూసెక్కులు, ఇన్‌ఫ్లో 29,845 క్యూసెక్కులుగా నమోదైంది.

ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి కాల్వలకు నిధులు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌రెడ్డి

రామన్నపేట, సెప్టెంబరు 21: ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి కాల్వలపై సమీక్షలతో మాత్రమే సరిపెట్టకుండా వెంటనే నిధులు విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి అన్నారు. సిరిపురం గ్రామంలో జరిగిన సీపీఎం గ్రామశాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మూసీ ఆధారిత చిన్న నీటి వనరుల్లో ముఖ్యమైన కాల్వలు ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి కాల్వలు ప్రారంభించి 20 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. ప్రభుత్వాలు మారినా కాల్వల దశలు మారడం లేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసి కాల్వలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు బాలుగురి అంజయ్య, అంబటి మల్లారెడ్డి, బడుగు రమేష్, మిరాయాల భాస్కర్, అంబటి సురేందర్‌రెడ్డి, రాపోలు ప్రభాకర్, మోటె స్వామి పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి: సీపీఎం

రాజాపేట, సెప్టెంబరు 21: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రాజాపేట మండల కేంద్రంలో సీపీఎం 8వ మండల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో వాగ్దానాన్ని విస్మరిస్తే ప్రజా వ్యతిరేకత తప్పదన్నారు. తపస్‌పల్లి, గంధమల్ల, రిజర్వాయర్ల ద్వారా రాజాపేట, ఆలేరు ప్రాంతంలో సాగునీరు అందించాలని కోరారు. సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఏచూరి సీతారాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మంగ నర్సింహులు, బబ్బురి పోశెట్టి, బబ్బురి రాదమ్మ, రామచంద్రం, రమాదేవి, కౌసల్య పాల్గొన్నారు.

అక్టోబరులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవాలి

మోత్కూరు, సెప్టెంబరు 21: ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం చేయకుండా అక్టోబర్ మొదటి వారంలో ప్రారంభించాలని భువనగిరిలో జరిగిన జిల్లాలోని సింగిల్ విండోల చైర్మన్లు, ఉపాధ్యక్షులు, సీఈవోల సమీక్ష సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకు వెళ్లానని శనివారం సాయంత్రం మోత్కూరు సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు మోత్కూరులో విలేకరులకు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం చేయడం వల్ల రైతులు తక్కువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి, నష్టపోతున్నారన్నారు. కొనుగోలు కేంద్రాలకు లారీలు సకాలంలో వచ్చేలా, మిల్లుకు వెళ్లినా వెంటనే దిగుమతి అయ్యేలా, ఏఈవోలు ఎంపిక చేసిన ధాన్యానికి మిల్లర్లు కొర్రీలు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని తాను అధికారులను కోరానన్నారు. సింగిల్ విండోల ఆధ్వర్యంలో దొడ్డు రకం, సన్న రకం ధాన్యం కొనేందుకు అవకాశం కల్పించాలన్నారు.

ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

మోత్కూరు, సెప్టెంబరు 21: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులు ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు, నాయకుడు పైళ్ల యాదిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మోత్కూరులో వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలు రూ.2300 ఉండగా ప్రైవేటు వ్యాపారులు రూ.2వేలకే కొనుగోలు చేస్తున్నారన్నారు. ట్రాక్టర్లపై తెచ్చిన ధాన్యాన్ని వేబ్రిడ్జిపై తూకం వేసి, ధాన్యం రాశి పోస్తారని, తూకాన్ని 65కిలోలకు ఒక బస్తాగా విభజించి, బస్తాలు వాడకుండానే బస్తాకు రెండు కిలోలు తరుగుతీస్తూ కనుపించని దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. రాశిపోసిన ధాన్యానికి బస్తాకు రూ.25 చొప్పున హమాలీ, వేబ్రిడ్జి చార్జీ, గుమాస్తా మామూలు పేరుతో రూ.వంద చొప్పున వసూలు చేస్తున్నారన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలన్నారు.

ప్రతీ విద్యార్థి సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

రామన్నపేట, సెప్టెంబరు 21: ప్రతీ విద్యార్థి సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రహత్‌ఖానం అన్నారు. శనివారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు కలిసి కళాశాలలో పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, డాక్టర్ అనిత, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వర్లు, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జేసీ.బాబు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్, అధ్యాపకులు సునీత, మల్లేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పత్తిలో రసం పీల్చే పురుగును నివారించాలి

భువనగిరి రూరల్, సెప్టెంబరు 21: పత్తి పంటలో రసం పీల్చే పురుగు నివారణపై ప్రతీ రైతు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ అన్నారు. శనివారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం, రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన ఆధ్వర్యంలో భువనగిరి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి, ఆయన పత్తి, వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వరిపైరుపై ఆకు నల్లి ఉధృతి గమనించామన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ సీహెచ్ పద్మావతి , డాక్టర్ కిరణ్‌కుమార్, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త కె.మమత రైతులకు పలు సూచనలు చేశారు.

అంకితభావంతో చదవాలి



సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న విద్యార్థినులు

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 21: విద్యార్థినులు క్రమశిక్షణ, అంకితభావంతో చదివి, ప్రయోజకులుగా ఎదగాలని చౌటుప్పల్‌లోని కస్తూర్బా బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారి కె.భవాని కోరారు. స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో శనివారం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థినులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు ఫ్రెషర్స్ డే నిర్వహించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 21 : ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భూదాన్‌పోచంపల్లి మునిసిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్ అన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 12వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సమగ్ర కులగణన-సామాజిక న్యాయం అంశంపై నిర్వ



భూదాన్‌పోచంపల్లి: లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతి సభలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

హించిన సదస్సులో వెనుకబడిన కులాల అభివృద్ధి, సమగ్ర కులగణన చేపట్టినప్పుడే వాటి ఫలాలు అందరికీ వారివారి దామాషా ప్రకారం అందుతాయని అన్నారు. స్థానిక సంస్థల్లోనే కాకుండా చట్టసభల్లోనూ రిజర్వేషన్లు రావాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీ శ్రీనివాస్, పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, చేనేత సహకార సంఘం మాజీ చైర్మన్ భారత వాసుదేవ్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, కెఎల్‌బీ ఫౌండేషన్ ప్రతినిధులు రాపోలు జ్ఞానేశ్వర్, తడక యాదగిరి, కర్నాటి పాండు, ఏలె భిక్షపతి, మెరుగు శశికళ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లవకుమార్, గునిగంటి రమేష్‌గౌడ్, శశికళ, అంజమ్మ, సీత దామోదర్, కర్నాటి బాలరాజు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సీత వెంకటేశం, బీజేపీ నాయకులు చిక్క కృష్ణ, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ సీత దామోదర్ పాల్గొన్నారు.

మోత్కూరు : బీసీ రిజర్వేషన్ సాధన సమితి, పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో వేర్వేరుగా మోత్కూరు మండల కేంద్రంలో లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్, నాయకులు కలిమెల నర్సయ్య, నోముల రమేష్, మునిసిపల్ కోఆప్షన్ సభ్యుడు గనగాని నర్సింహ, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాశికంటి లక్ష్మీనర్సయ్య, పద్మశాలి సంఘం అధ్యక్షుడు కూరపాటి రాములు, మోత్కూరు చేనేత సహకార సంఘం అధ్యక్షుడు జెల్ది రాములు, సోమయ్య, గుండు వెంకటనర్సు పాల్గొన్నారు.

వలిగొండ: మండల కేంద్రంలో శాఖ గ్రంథాయలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘననివాళులర్పించారు. పద్మశాలి సేవా విభాగం అధ్యక్షులు సాయిని యాదగిరి, నాయకులు గంజి వెంకటేశం, ఎక్కలదేవి శ్రీను, రచ్చ సంతోష్, నామ జగన్, లక్ష్మయ్య, ఈశ్వర్, రాఘవేందర్, గ్రంథాయాల ఇన్‌చార్జి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎలగందుల మహేష్, నోముల యాదగిరి, పెంట శంకరయ్య, శ్రీనివాస్ , రచ్చ బిక్షపతి, వంగరి బుచ్చిరాములు, సాయిని బాబు, జ్ఞానేశ్వర్, వెంకటేశ్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చౌటుప్పల్ టౌన్ : పట్టణంలో లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి పలువురు



చౌటుప్పల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, టీడీపీ, బీజేపీ మునుగోడు అసెంబ్లీ ఇంచార్జిలు బడుగు లక్ష్మయ్య, దూడల బిక్షం గౌడ్, చేనేత రాష్ట్ర నాయకుడు గోశిక రవి, మాజీ ఎంపీపీ చిక్కా నర్సింహ్మా, ఏఎంసీ మాజీ చైర్మన్ బడుగు మాణిక్యం, కాంగ్రెస్ , టీడీపీ, బీజేపీ పట్టణ అధ్యక్షులు సుర్వి నర్సింహ, సుంకరి జంగయ్య, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, నాయకులు నల్ల పర్వతాలు, గోశిక పాండు, చిలువేరు రాజు, వెంకటేశం, రఘుపతి పాల్గొన్నారు.



రామన్నపేటలో కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

రామన్నపేట: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు సంగిశెట్టి సుదర్శన్, పట్టణ అధ్యక్షుడు రచ్చ యాదగిరి, నాయకులు అప్పం లక్ష్మీనర్సు, బడుగు రమేష్, కైరంకొండ నాగభూషణం, కొంగరి జానయ్య, వున్న వెంకటేశం, మిర్యాల భాస్కర్ కొండ పాండునాథ్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సూరపెల్లి శివాజీ, వంగరి రఘు, సురపల్లి వెంకటేశం, దోర్నాల అంజయ్య, మేకని రామకృష్ణ, సూరపల్లి జవహర్, సూరపల్లి జనార్ధన్, సూరపెల్లి మోహన్, విడం వెంకటేశం, దోర్నాల బిక్షపతి, సంగిశెట్టి లక్ష్మీనారాయణ, పగిడిమర్రి విష్ణు పాల్గొన్నారు.



సంస్థాన్‌నారాయణపురంలో నివాళులర్పిస్తున్న నాయకులు

క్రీడల్లో గెలుపోటములు సహజం

వలిగొండ, సెప్టెంబరు 21: క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ప్రధానోపాధ్యాయుడు ఎస్.భాస్కర్ తెలిపారు. మండల కేంద్రంలో శ్రీ వేంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 68వ మండల స్థాయి పాఠశాలల క్రీడలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. బాలికల కబడ్డీ విభాగంలో టేకుల సోమారంకు ప్రథమ బహుమతి, అరూరుకు ద్వితీయ బహుమతి అందజేశారు. ఖోఖోలో బాలుర విభాగంలో ప్రథమ బహుమతి సంగెం, ద్వితీయ బహుమతి జడ్పీహెచ్ఎస్ వలిగొండ, బాలికల ఖోఖో విభాగంలో ప్రథమ బహుమతి మోడల్ స్కూల్, ద్వితీయ బహుమతి సంగెం, బాలుర వాలీబాల్ ప్రథమ బహుమతి సంగెం, ద్వితీయ బహుమతి జడ్పీహెచ్ వలిగొండ సాధించారు. గెలుపొందిన జట్లకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంగెం ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు స్వామిరాజు, చండీదాసు, మల్లేశం, మహేష్, జయరాణి, రాంప్రసాద్, సంధ్యారాణి, మాధవి, అయిలయ్య, పాల్, మన యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రాజాపేట: మండల కేంద్రంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడాల్లో విజేతలకు ఎంఈవో కృష్ణ బహుమతులను అందజేశారు. అండర్-17 కబడ్డీ పోటిల్లో జడ్పీహెచ్ఎస్ రాఘునాథ్‌పూర్, వాలీబాల్ జడ్పీహెచ్ఎస్ బొందుగుల, ఖోఖోలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలో బాలికల విభాగంలో అండర్-17



రాజాపేట: బహుమతులు సాధించిన విద్యార్థులు

కబడ్డీ, జడ్పీహెచ్ఎస్ రాజాపేట వాలీబాల్‌లో పాముకుంట, బొందుగుల ఖోఖో బేగంపేట అండర్-14 విభాగంలో కబడ్డీ, బాలుర విభాగంలో గురుకుల పాఠశాల రాజాపేట ఖోఖో, ఖోఖోలో రాజాపేట గురుకుల పాఠశాల వాలీబాల్ గురుకుల పాఠశాల, రన్నింగ్ అండర్-17 బాలుర విభాగంలో గురుకుల పాఠశాల రాజాపేట, అండర్-14 గురుకుల పాఠశాల శాట్‌పుట్‌లో అండర్-17 బాలుర పాఠశాల రాజాపేట ద్వితీయ స్థానంలో గురుకుల పాఠశాల, బాలికల విభాగంలో జడ్పీహెచ్ఎస్, ప్రథమ రాఘునాథ్‌పూర్, ద్వితీయ దూదివెంకటపూర్ గెలుపొందారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీలు, శోభారాణి, ప్రభ, కృష్ణమూర్తి, మధు, వరలక్ష్మీ, సంపత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును విస్మరిస్తున్న ప్రభుత్వం

భువనగిరి టౌన్, సెప్టెంబరు 21: విద్యారంగంపై నిర్లక్ష్యంపై చూపుతూ విద్యార్థుల భవిష్యత్తును రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తున్నదని ఏబీవీపీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ సుర్వి మణికంఠ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జూపల్లి దీపిక అన్నారు. శనివారం భువనగిరిలో జరిగిన పట్టణ ఏబీవీపీ అభ్యాసవర్గలో మాట్లాడారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఉపాధ్యాయులు, లెక్చరర్ల పోస్టుల ఖాళీలు, మౌలిక వసతులలేమి, ప్రైవేట్ రంగంలో ఫీజుల దోపిడీతో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వానికి విద్యారంగంపై సమగ్ర ప్రణాళిక లేకపోవడమే ఈ దుస్థితికి కారణమన్నారు. పరిష్కారం కోసం విద్యార్థులతో కలిసి ఏబీవీపీ ఆందోళనలు చేపడుతుందన్నారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శిగా గద్దె నితిన్, ఉపాధ్యక్షుడిగా సామల సాయికుమార్, సహాయ కార్యదర్శిగా మణికంఠ, జోనల్ ఇన్‌చార్జులుగా పవన్‌కుమార్, గణేష్, కార్యవర్గ సభ్యులుగా నీలకంఠ, ఉదయ్ హర్షవర్ధన్, మణి, సాయి, లోకేష్, అంకిత్, శివను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



అభ్యాసవర్గలో మాట్లాడుతున్న ఏబీవీపీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ మణికంఠ

సంక్షిప్తంగా..

భూదాన్‌పోచంపల్లి : ఇంటర్, పదో తరగతి విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరంలో 10జీపీఏ సాధించిన వారికి, ఐఐటీ, ఎన్ఐటీ, ఎన్ఈఈటీ (నీట్) జాతీయ పరీక్షల్లో ప్రతిభను చూపిన విద్యార్థులకు శనివారం వెండి పతకాలతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్ హాజరయ్యారు. తడక కల్పన ఫౌండేషన్ చైర్మన్ తడక చారులత, ప్రతినిధులు తడక యాదగిరి, కృష్ణకుమార్ ఉన్నారు.

భువనగిరి టౌన్: తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి క్రిస్టఫర్, మహిళా విభాగం అధ్యక్షురాలు గంధమల్ల మల్లమ్మ అన్నారు. భువనగిరిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 27న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఫోరం ఆరవ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలన్నారు. డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

ఆలేరు రూరల్ : దూర విద్య ద్వారా ఉన్నత విద్యా లక్ష్యాలకు చేరుకోవచ్చునని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ధర్మానాయక్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జే.రాజారామ్, కందుకూరి వెంకటేశ్వర్లు, ఉపేంద్ర ఉన్నారు.

భువనగిరి రూరల్: ప్రతీ చిన్నారికి వ్యాధి నిరోధక టీకాలు షెడ్యూల్ ప్రకారం ఇవ్వాలని మండల వైద్యాధికారి డాక్టర్ యామిని శృతి అన్నారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని బీఎన్‌తిమ్మాపురంలో టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. పల్లె దవాఖాన డాక్టర్ విజయ దుర్గ, కిరణ్, జ్యోతి పాల్గొన్నారు.

రాజాపేట: అంకిత భావంతో ఉద్యోగులు తమ విధులను నిర్వహిస్తే తగిన గుర్తింపు పొందుతారని అఖిలపక్ష నాయకులు మధుసూధన్‌రెడ్డి, శ్రీనివాస్, మహేందర్‌గౌడ్, తిరుమల్లేష్ అన్నారు. రాజాపేట మండలంలోని రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారిగా పనిచేసిన మాధవిని సన్మానించారు.

భువనగిరి టౌన్: ప్రభుత్వం రేషన్‌డీలర్ల సమస్యలను పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మన్నె యాదగిరి కోరారు. భువనగిరిలో జరిగిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 24న హైదరాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభకు రేషన్‌డీలర్లు హాజరు కావాలని కోరారు.

భువనగిరి టౌన్: అభివృద్ధిలో కీలకమైన భవన నిర్మాణ కార్మికులను ప్రభుత్వం విస్మరిస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు అన్నారు. శనివారం భువనగిరిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

వలిగొండ: మండలంలోని అరూరు గ్రామానికి చెందిన బాసాని నర్సింహ శనివారం మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు మాజీ ఎంపీపీ చిట్టెడి జనార్ధన్‌రెడ్డి రూ.5వేలు, తుమ్మల నర్సయ్య సేవా సమితి రూ.5వేలు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీఎన్‌రెడ్డి రూ.5016, డీసీపీ ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై అవగాహన కల్పించి, విద్యార్థులతో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ బి సురేష్‌రెడ్డి, వి.జ్యోతి, హరిప్రసాద్, తులసీ, వెంకటేశ, శివశంకర్, వెంకట్‌రెడ్డి, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

మోత్కూరు : గ్రామాల్లో ప్రజలు విషజ్వరాలతో బాధపడుతున్నారని, వైద్య శిబిరాలు నిర్వహించి రోగులకు చికిత్స అందించాని సీపీఎం జిల్లా కమిటి సభ్యుడు బొల్లు యాదగిరి డిమాండ్ చేశారు. మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని కొండగడపలో జరిగిన సీపీఎం గ్రామ శాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. చాతరాశి నర్సింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు నర్సయ్య, యాదయ్య, రామచంద్రయ్య పాల్గొన్నారు.

మోత్కూరు : పీసీసీ లీగల్, హ్యూమన్ రైట్స్, ఆర్టీఐ విభాగానికి తనను కన్వీనర్‌గా నియమించారని మోత్కూరు మండలం దాచారం గ్రామానికి గ్రామానికి చెందిన అంతటి స్వామిగౌడ్ శనివారం విలేకరులకు తెలిపారు. టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ అశోక్ గౌడ్ తనకు నియామక పత్రం అందించారన్నారు.

మోత్కూరు : రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డును ఇన్సూరెన్సు కంపెనీలకు అప్పగించరాదని భవన నిర్మాణ కార్మిక సఘం (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు గొరిగె సోములు డిమాండ్ చేశారు. మోత్కూరు అంబేద్కర్ చౌరస్తాలో ఈ నెల 23న హైద్రాబాద్ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నా కరపత్రాలను ఆయన విడుదల చేశారు.

మోత్కూరు : మండలంలోని పాలడుగు ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీ అయి వెళుతున్న ఉపాధ్యాయులను, పాఠశాలకు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను పాఠశాలలో ఘనంగా సన్మానించారు. బదిలీపైవెళుతున్న ఉపాధ్యాయులు నర్సయ్య, అశోక్, మురళికి వీడ్కోలు, కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు కమలాకర్ రెడ్డి, వెంకటగిరికి స్వాగతం పలికారు.

ఆలేరు రూరల్: వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా ఈనెల 22వ తదీన ఆలేరుకు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావులతో పాటు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజవుతారని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు. ప్రజలు అధికసంఖ్యలో రావాలని కోరారు.

ఆలేరు రూరల్: విద్యార్థులు మంచి నడవడికను అలవర్చుకుని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పూజారి వెంకటేశ్వర్లు అన్నారు.

లబ్ధిదారునికి ఎల్‌వోసీ అందజేత

మోత్కూరు, సెప్టెంబరు 21: మండలంలోని పాటిమట్ల గ్రామానికి చెందిన గొల్యాల అనసూర్య అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమె నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవడానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ రూ.2.50 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించి, శనివారం అనసూర్య కుమారుడు రాంరెడ్డికి అందజేశారు. మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన నాగుల లింగయ్య అనారోగ్యం పాలై చికిత్స పొందాడు. నిరుపేద కుటుంబీకుడైన అతనికి ఎమ్మెల్యే మందుల సామేల్ సహకారంతో సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.18 వేల చెక్కును మునిసిపల్ చైర్ పర్సన్ గుర్రం కవితలక్ష్మీనర్సింహారెడ్డి లబ్ధిదారునికి శనివారం అందించారు. కార్యక్రమంలో ఆరో వార్డు కౌన్సిలర్ వనం స్వామి, నాయకులు పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, గుండగోని రామచంద్రు, బద్దం నాగార్జునరెడ్డి, దేవరపల్లి రంగారెడ్డి, అర్ధ ప్రతాపరెడ్డి, ముస్కు వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సామేల్

ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలి

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 21: ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని వృద్ధులు ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాగించాలని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. స్థానిక షాదీఖానలో శనివారం ప్రభుత్వ ఆయుర్వేదిక్ వైద్యశాల ఆధ్వర్యంలో ఆయుష్ ఆయుర్వేదిక్ వృద్ధాప్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వృద్ధులకు అవసరమైన అన్ని రకాల పరీక్షలను నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కె.నర్సింహారెడ్డి, ఆయుష్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీవల్లి, యునానీ వైద్యులు సల్మా సుల్తానా, కాటం రాజు, కౌన్సిలర్ ఎండీ.బాబాషరీఫ్, సీనియర్ సిటిజన్ ఫోరం మండల అధ్యక్షుడు కానుగుల వెంకటయ్య పాల్గొన్నారు.

ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా దానయ్య



భువనగిరి అర్బన్, సెప్టెంబరు 21: ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా శివరాత్రి దానయ్య సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. యాదగిరిగుట్ట మండలంలోని జంగంపల్లికి చెందిన దానయ్య టీడీపీలో జిల్లా స్థాయి నాయకుడిగా గుర్తింపు పొందారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య నేతృత్వంలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతుండగా దానయ్య సేవలను గుర్తించిన ప్రభుత్వం ఆలేరు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా అవకాశం కల్పించింది.

అసంబద్ధ ఉత్తర్వులను ఉపసంహరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తపస్ రాష్ట్ర అదనపు కార్యదర్శి పెంటయ్య

సంస్థాన్‌నారాయణపురం, సెప్టెంబరు 21: అసంబద్ధమైన సర్దుబాటు ఉత్తర్వులను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని తపస్ రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య డిమాండ్ చేశారు. తపస్ ఆధ్వర్యంలో సంస్థాన్ నారాయణపురం మండలంలో శనివారం సభ్యత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం జారీ చేసిన మార్గదర్శకాలు ప్రాథమిక పాఠశాలల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి స్పష్టమవుతోందని ఆయన అన్నారు. ప్రాథమిక పాఠశాలలకు సంఖ్యతో సంబంధం లేకుండా 50లోపు విద్యార్థులు ఉన్న స్కూల్స్‌కు ముగ్గురు ఉపాధ్యాయులను, 50నుంచి 100 వరకు ఉన్న స్కూల్స్‌కు ఐదుగురు ఉపాధ్యాయులను కేటాయిస్తూ ప్రతి పాఠశాలకు ఒక హెచ్ఎం పోస్టును మంజూరు చేయాలని కోరారు. తపస్ జిల్లా అధ్యక్షుడు రేపాక ఉమ, జిల్లా ప్రధాన కార్యదర్శి కొమిరెల్లి భాస్కర్‌రెడ్డి, సంస్థాన్‌నారాయణపూర్, మండల అధ్యక్షుడు మన్నెం నరేందర్ రెడ్డి, కుమారస్వామి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

దేశంలో సుస్థిరపాలన బీజేపీతోనే సాధ్యం

వలిగొండ, సెప్టెంబరు 21: దేశంలో సుస్థిరపాలన బీజేపీతోనే సాధ్యమని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్‌గుప్తా, పార్టీ మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ తెలిపారు. శనివారం మండలంలోని టేకులసోమారం, పహిల్వాన్‌పురం గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదును చేపట్టారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశంలో అవినీతి రహిత పాలన అందిస్తున్నారని కొనియాడారు. ప్రపంచ దేశాలకు భారతదేశం విశ్వగురువు అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి లోడే లింగస్వామి, శక్తి కేంద్ర ఇన్‌చార్జి మందాడి రంజిత్‌రెడ్డి, నాయకులు వెంకటేశం పాల్గొన్నారు.

రాజాపేట: మండలంలోని రాఘునాథ్‌పూర్, బొందుగుల, రాజాపేట గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ సేకరణ నిర్వహించారు. నాయకులు ఊట్కూరి అశోక్‌గౌడ్, బాల్‌రెడ్డి, దాచేపల్లి రాజు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



టేకులసోమారంలో సభ్యత్వ నమోదులో బీజేపీ నాయకులు